క్లుప్తంగా

11 నుంచి సంక్రాంతి సంబరాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని సాహిత్య మండలి ఆధ్వర్యాన వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 11వ తేదీన తమ సాహిత్య మండలి ప్రాంగణంలో హైస్కూల్ విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి నేటి మన పండుగలు - సంక్రాంతి పండుగ విశిష్టత అనే అంశంపై వ్యాస రచన, స్వామి వివేకానంద జీవిత విశేషాలపై క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని, పోటీల్లో విజేతలకు ఈనెల 13వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్ నెంబర్: 94404 20831కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని సంక్రాంతి సాహిత్యోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఉదయం నాట్యాచార్య గండికోట రాజేష శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, చిన్నారులతో భీముడు, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయ ప్రదర్శన ఉంటుందన్నారు. 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఎస్‌పీఎస్ వాసు మ్యూజిక్ అకాడమీ శిష్యుల సంగీత వాద్య సమ్మేళనం, అనంతరం విశాఖపట్నానికి చెందిన బి.శ్రీలాస్య అన్నమాచార్య కీర్తనల ఆలాపన కార్యక్రమం, అనంతరం సంక్రాంతి సాహిత్యోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

దెందులూరు: అంకితభావం, ప్రణాళిక, సత్ఫలితాల సాధనదిశగా పని చేసేవారు ఎవరికైనా అవార్డులు ప్రోత్సాహాన్నిస్తా యని పండిట్ పరిషత్ రాష్ట్ర నాయకులు గిరిరాజు, పారిశ్రామికవేత్త నారా శేషు, దెందులూరు బాలికల పాఠశాల హెచ్‌ఎం పీ.శ్రీదేవి అన్నారు. ఆదివారం దెందులూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జి జ్యోతిని గిరిరాజు, నారా శేషు తదితరులు సత్కరించారు.

చెకుముకి పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం

పెదపాడు: అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు పోటీల్లో విద్యార్థులు వీ రవికిరణ్, ఎం రాఘవేంద్ర, పీ రూపిణి ప్రథమ స్థానం సాధించారు. శిక్షణ అందించిన సైన్స్ ఉపాధ్యాయులు ఎం అమరావతి, ఏ విజయసారధిని ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రమాదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తదితరులను విద్యార్థులను అభినందించారు.

విశ్వ బ్రాహ్మణుల ఉత్తర క్రియలకు స్థలం కేటాయిస్తాం

ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ

ఏలూరు (టూటౌన్): విశ్వ బ్రాహ్మణులకు అపరకర్మల భవనానికి స్థలం కేటాయిస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని హామీ ఇచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో విశ్వ బ్రాహ్మణ అనుబంధ వృత్తి సంఘాల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నాని కలిశారు. విశ్వ బ్రాహ్మణుల సంస్కృతిలో అపరకర్మలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఇందుకు సరైన భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విశ్వ బ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు గోపి ఆధ్వర్యాన సంఘాల ప్రతినిధులు నాని దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ వివిధ సందర్భాలలో ఈ విషయాన్ని సంఘీయులు తన దృష్టికి తీసుకు వచ్చారని, అతి త్వరలోనే నగరంలో అపరకర్మలకు వీలుగా స్థల సేకరణ చేసి సంఘానికి ఇస్తామన్నారు. కార్పెంటర్ల వృత్తికి అనువుగా క్లస్టర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో చర్చించి ప్రభుత్వ పరంగా, తన పరంగా అవసరమైన మేరకు పూర్తి సహాయ సహకారాన్ని అందిస్తానన్నారు. విశ్వ బ్రాహ్మణులకు అవసరమైన ఏ విషయంలోనైనా తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా లక్కోజు గోపి మాట్లాడుతూ నగరంలో బీసీ సామాజిక వర్గాలకు పక్షపాతిగా వివిధ బీసీ వర్గాల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలాలు కేటాయించడంలో, భవన నిర్మాణంలోనూ అడిగిన వారందరికీ సహకరించారాని అలాగే అనేక మంది పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణంలోనూ అడిగిన వారికి అర్హతను బట్టి న్యాయం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో వడ్రంగి పని వారల సంఘ అధ్యక్షుడు పొట్నూరి శివరావు, హేలాపురి విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గూడరి హేమ దుర్గాప్రసాద్, బులియన్ మర్చంట్స్ జోనల్ చైర్మన్ కాద రాంబాబు, ముదురు సత్యనారాయణ, కెళ్ల దుర్గాప్రసాద్, లంకలపల్లి జగదీష్, అద్దంకి సత్యనారాయణ, వీర్ని వైనేశ్వరరావు, మానేపల్లి నాగేశ్వరరావు, ఎలబాక కృష్ణ, వడ్రంగి సంక్షేమ సంఘ నాయకులు, శనివారపుపేట రుద్రభూమి సంఘం, స్వర్ణకారుల సంఘాల నాయకులు దాదాపు 200 మంది ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసిన వారిలో ఉన్నారు.



ఎమ్మెల్యే నానిని కలిసిన విశ్వ బ్రాహ్మణ సంఘాల నాయకులు

పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): స్థానిక వసంత మహల్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు పార్కు ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏలూరు ఆర్యవైశ్య సంఘ పెద్దలు అభ్యర్థన మేరకు ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నుంచి రూ.12 లక్షల నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన పార్కు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్, గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల చైర్మన్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఏలూరు ఆర్యవైశ్య సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం ఏలూరు అమీనాపేటలో స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమీనా పేట శ్రీ రామాలయ భక్త బృందం ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ 22వ తేదీ సాయంత్రం తమ ఇంటి ముందు 6 దీపాలు వెలిగించి స్వామివారి అక్షింతలు తలపై వేసుకుని శ్రీ హనుమత్ సమేత సీతారాముల కటాక్షం పొందాలని కోరారు. ఈ సందర్భంగా తురగా రామకృష్ణ, జాస్తి నాగేశ్వరరావు తదితర కుటుంబాలకు అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు కడలి భాస్కర్, కడలి పాండు, కొమ్ముల తిరుమలేష్, పుప్పాల ముకుందరావు, నాగమోలు శేఖర్, మృనాళిని, కోటి నాగమణి, కె.గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

దెందులూరును నంబర్ వన్ చేస్తా

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ఏలూరు రూరల్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తన ధ్యేయం అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. ఆదివారం ఆయన ఏలూరు రూరల్ మండలం జాలిపూడి, కాట్లంపూడిలో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల టీడీపీ పాలనలో పచ్చ నాయకులు దెందులూరు నియోజకవర్గాన్ని అక్రమాలు, బెదిరింపులకు చిరునామా చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గం అభివృద్ధి, ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా నిలిచిందన్నారు. టీడీపీ పాలనలో గ్రామానికి రూ.20 నుంచి రూ.30 లక్షలు ఖర్చు చేయడమే గగనమైతే, వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్కొక్క గ్రామానికి రూ.30 నుంచి రూ.50 కోట్ల రూపాయలు వెచ్చించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపానన్నారు. వందల కోట్ల రూపాయల నిధులతో ప్రధాన రోడ్ల అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకు, కల్వర్టులు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశామని వివరించారు. దెందులూరు, పెదపాడు, పెదవేగి, కొల్లేరు ప్రజల కోసం విద్యుత్ లైన్లు ఆధునికీకరణ, సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువు చేసేందుకు సచివాలయం, వైఎస్ఆర్ క్లినిక్, ఆర్‌బీకే కేంద్రాలు నిర్మించామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు చేపట్టి, అనేక రంగాల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో నియోజకవర్గంలో నీటి పారుదల వ్యవస్థ మెరుగుపరిచామని గుర్తు చేశారు.



జాలిపూడిలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

అందరికీ సంక్షేమ పథకాలు

టీడీపీ పాలనలో పేదవాడికి పింఛన్ మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్ళు మొక్కాల్సిన దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, వర్గ భేదం లేకుండా అర్హత కల్గిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో 1.50 లక్షల మంది ప్రజలకు సంక్షేమ పథకాల అందుతున్నాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం వందల కోట్లు విడుదల చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీని గెలిపించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాలిపూడిలో సచివాలయం, సీసీ రోడ్లు తదితర పనులు ప్రారంభించారు. కాట్లంపూడిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. స్థానిక మహిళల కోరిక మేరకు డ్రెయినేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 3న పైడిచింతపాడులో ప్రారంభమైన ఎమ్మెల్యే పాదయాత్ర కాట్లంపూడితో ముగిసింది. ఎమ్మెల్యే వెంట వడ్డీకుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీఓ బి.ప్రణవి, దెందులూరు ఎఎంసీ చైర్మన్ అప్పన్నప్రసాద్, వడ్డీకుల కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, ఎంపీటీసీ కాకర్ల తంబి, సర్పంచ్‌లు వీధి నవ్య, నిట్టా అక్కమ్మ, బలే నాగప్రసాద్, మధ్యాహ్నపు వాసు, కోడిచుక్కల నాగశేషు, పరుశురాం, వర్రీ నారాయణ, పంపుల శ్రీను తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ఏలూరు రూరల్: పోణంగి మండల పరిషత్ పాఠశాలలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇటీవల బదిలీ అయిన జీజేపీ స్టీవెన్, కె.దేవీప్రసాద్‌లను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. డీఈఓ పి.శ్యామ్‌సుందర్, జిల్లా డీఆర్‌డీఓ పీడీ ఆర్.విజయరాజు, పెదపాడు, ఏలూరు ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, ప్రకాష్ రాజు, ఎంఈఓ 2 రంగయ్యతో పాటు ఉపాధ్యాయులు తేరా ప్రభాకర్, మాసగిరి శ్రీనివాస్, పోణంగి పాఠశాల హెచ్‌ఎం కందుల రాంబాబు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తాఫా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీని తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): మందులపై జీఎస్టీని తగ్గించాలని, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లకు కార్మిక చట్టాలు అమలు చేసి, కనీస వేతనం ఇవ్వాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ యూవీ కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక పవర్ పేటలోని సీఐటీయూ కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన యూనియన్ వార్షిక మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీఎస్టీ పేరుతో అన్ని రకాల వస్తువులపై విపరీతంగా పన్నులను పెంచిందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణావసరమైన మందులపై కూడా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించటం దారుణమని అన్నారు. జీఎస్టీ నుంచి ప్రజల అత్యవసర, నిత్యావసర మందులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఫార్మా సంస్థలు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. ఫార్మా రంగంలో పనిచేస్తున్న సేల్స్ రిప్రజెంటేటివ్‌లకు కార్మిక చట్టాలు వర్తింపజేయాలని అన్నారు. కనీస వేతనాలు అమలు చేసేలా ఫార్మా కంపెనీలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పి.కిషోర్ మాట్లాడారు. యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా మొహిద్దీన్, కోశాధికారిగా వై.దుర్గారావు, ఉపాధ్యక్షులుగా పి.కిరణ్ కుమార్, పి.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా సీతయ్య, ఉమా మహేష్, కమిటీ సభ్యులుగా చెన్న కేశవ, సీహెచ్ కార్తీక్, కె.శివలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూవీ కృష్ణయ్య

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక



1989-90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ఏఆర్‌డీజీకే పాఠశాలలో 1989-90 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల కలయిక ఆదివారం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులంతా ఒకరిని ఒకరు అభినందించుకుంటూ ఆ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి భాగస్వామ్యం వహించాలని, ఒకరికి ఒకరు అండగా నిలవాలని, శుభకార్యాలు, కష్టాల్లో పాలుపంచుకోవాలని ఒకరికి ఒకరు చేదోడువాదోడుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అలాగే ఈ కలయికను ప్రతి ఏటా నిర్వహించుకోవాలని తీర్మానించుకున్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, మ్యూజికల్ చెయిర్స్, అంత్యాక్షరి వంటి క్రీడల్లో పాల్గొని ఆనందించారు. పూర్వ విద్యార్థుల బృందంలో ఎస్.గీత, ఆర్.లలిత కుమారి, ఎస్‌కే రియాజ్ తదితరులు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

ఆకట్టుకున్న సంగీత వాయిద్య సమ్మేళనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్ వాసు బృందం నిర్వహించిన అన్నమాచార్య గీతాలాపన, సంగీత వాయిద్య సమ్మేళనం సంగీత కళాప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. తొలుత కార్యక్రమాలను గణపతి, నటరాజ స్వామి పూజ, జ్యోతి ప్రకాశనంతో హిందూ యువజన సంఘ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు అంబికా రాజా, సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు తదితర సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో గాయని గాయకులు బీకే బిందు, ఎస్‌పీఎస్ వహీదా వాసు, వై.అర్జున్‌రావులు ఆలపించిన నారాయణతే నమో నమో, వినరో భాగ్యము, చూడరమ్మ సతులార, వేడుకుందామా.. అన్నమాచార్య కీర్తనలు వీనుల విందు చేశాయి. ఎస్‌పీఎస్ వాసు, ఎన్వీ గంగాభవాని, సీహెచ్ కళ్యాణ్, డి.నరేష్‌ల శాస్త్రీయ వాద్య సమ్మేళనం వీణ, వయోలిన్, ఫ్లూట్, తబలా, గిటార్ వంటి వివిధ శాస్త్రీయ సంగీత వాద్య సమ్మేళనం ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో హిందూ యుజవన సంఘ ప్రతినిధులు ఇరదల ముద్దుకృష్ణ, మజ్జి కాంతారావు, సీహెచ్ సాయితేజ, బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కేబీ రావు, లంక వెంకటేశ్వర్లు, వీవీవీ హనుమంతరావు, వంకినేని భానుప్రకాష్, రేవూరి శివశంకర్ వరప్రసాద్, పిలగల కొండలరావు, ఎ.పార్వతి రామచంద్రన్ ఎ.రంగ వరప్రసాద్, దువ్వి హేమసుందర్, గుడిపాటి లలితా శర్మ, గరికపాటి కాళిదాసు, అధిక సంఖ్యలో సంగీత అభిమానులు పాల్గొన్నారు.



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న బీకే బిందు

కృత్రిమ కాళ్ల పంపిణీకి ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కృత్రిమ కాళ్ల పంపిణీ నిమిత్తం ఎంపిక శిబిరం నిర్వహించారు. పుట్టుకతో అంగవైకల్యం, ప్రమాదాల వలన కాళ్లు పోవడం, మధుమేహ వ్యాధి తీవ్రతతో కాళ్లు తొలగించిన వారికి నడవడానికి తోడ్పడే ఆర్టిఫిషియల్ లెగ్స్ (కృత్రిమ కాళ్లు) ఉచితంగా పంపిణీ చేయడానికి క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, సెక్రటరీ బొల్లా వీవీ సత్యనారాయణ, కోశాధికారి డి.రమాదేవి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణయ్య, ప్రవాసాంధ్రులు డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ హిమబిందు (యూఎస్‌ఏ) ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ పూర్వపు గవర్నర్ డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి అతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, వైస్ గవర్నర్లు కాకరాల వేణుబాబు, పాపారావు నాయుడు, పూర్వపు గవర్నర్ మేకా శ్రీరామ్ సురేష్, కేవీ కిషోర్ కుమార్, రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జునరావు, జోన్ చైర్మన్ కుర్మా శ్రీనివాస్, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ దువ్వి హేమసుందర్ పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 150 మంది వికలాంగులకు స్క్రీనింగ్ నిర్వహించి 90 మందిని ఎంపిక చేశారు. వారందరికీ కొద్ది రోజుల్లోనే కృత్రిమ అవయవాలు అందిస్తామని క్లబ్ అధ్యక్షుడు తెలిపారు.



పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	15	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	24	బీక్షదిక్కుడు	76
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	54
బెండకాయలు	60	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	42	కంద	54
కాకర కాయలు	64	బీట్‌రూట్	36
బీరకాయలు	--	కీర దోస	34
బీరకాయలు (పందిరి)	64	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	24	అల్లం	128
క్యారెట్	48-60	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25-30	తోటకూర	10
గోరుచిక్కుడు	52	గోంగూర	08
దోసకాయలు	34-48	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

వైభవంగా కొనసాగుతున్న త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సుదర్శన నారసింహేష్టి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి ప్రదర్శించిన భక్తి సంగీత విభావరి, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన వేదుల జయలక్ష్మి, గుడిపాటి శిరీష నిర్వహించిన భక్తి సంగీత విభావరి వీనుల విందు చేసింది. 6 గంటలకు ముక్కామల శ్రీవల్లి బృందం భక్తి సంకీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. రాత్రి 7 గంటలకు విజయవాడకు చెందిన భారతి రాఘవ నృత్య కేంద్రం ఆధ్వర్యాన నాట్యాచారిణి అపర్ణా ప్రసాద్ శిష్య బృందం, రాత్రి 8 గంటలకు గుడివాడకు చెందిన అభినయ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి కేవీ జ్యోతి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా, ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక స్వాములు